క్లుప్తంగా

యువతకు క్రీడలు అవసరం



తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు క్రీడలు ఎంతో అవసరం అని సీఐ జగదీష్ అన్నారు. మండలంలోని వెలికట్ట గ్రామంలో తొర్రూరు, పెద్దవంగర, నెల్లికుదురు, దంతాలపల్లి పోలీస్ టీమ్‌లు, వెలికట్ట గ్రామ యూత్ టీమ్‌ల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు ఉపేందర్, రాజు, పోలీస్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ..



దంతాలపల్లి: ఉదయం కురుసిన పొగ మంచుతో రెండు లారీలు ఢీకొన్న సంఘటన మండలం కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన డ్రైవర్ మూవీస్ ఖాన్ తన లారీలో బొగ్గు లోడుతో మహారాష్ట్ర నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వెళ్తున్నాడు. హర్యానాకు చెందిన షఫీఖాన్ లోడు లారీతో మండల కేంద్రం సమీపంలోకి రాగానే పొగ మంచు కారణంగా రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇద్దరు డ్రైవర్లను చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కల్వర్టు నిర్మించాలని వినతి



బయ్యారం: మండలంలోని బాలాజీపేట పంచాయతీ పరిధిలోని తీశ్రీతండాలో కల్వర్టును నిర్మించాలని కోరుతూ ఆదివారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కల్వర్టు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమేష్, రాంమూర్తిగౌడ్, వెంకటేశ్వర్లు, రమేశ్, అశోక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కురవి: ప్రతీ ఉద్యోగికి పదవి విరమణ తప్పదని మహబూబాబాద్ విద్యుత్ శాఖ డీఈ విజయ్ అన్నారు. ఆదివారం కురవికి చెందిన ములుగు జిల్లా వాజేడు తహసీల్దార్ దబ్బెటీ వీరభద్రప్రసాద్ పదవి విరమణ సన్మాన సభ కురవిలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో నర్సింహరావు, వీరన్న, ఆనందం, కృష్ణ, లక్ష్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

మహబూబాబాద్: ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డాక్టర్ రవీందర్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టారు. కాగా ఆదివారం డాక్టర్ రవీందర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వీరన్న, సరస్వతి, నీలిమా, స్రవంతి, భాస్కరరావు పాల్గొన్నారు.

రాజుతండాలో క్రికెట్ పోటీలు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని రాజుతండాలో ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. హైదరాబాద్‌లో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న రాజుతండాకు చెందిన డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో తండాకు చెందిన పూర్వపు మిత్రుల మధ్య నిర్వహించిన క్రికెట్ పోటీలు పోటాపోటీగా నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5వేల నగదుతో పాటు షీల్డ్ అందజేశారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణానికి చెందిన అయ్యప్ప స్వామివారి దీక్ష స్వీకరించిన స్వాములు స్థానిక శ్రీధర్మశాస్త అయ్యప్ప స్వామివారి దేవాలయం నుంచి ఇరుముడిధారణతో ఆదివారం శబరిమల అయ్యప్ప స్వామివారి సన్నిధానానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో నర్సింహారావుస్వామి, భీముడుస్వామి, నాగమల్ల సురేష్ స్వామి, శ్రీధర్ రెడ్డిస్వామి, శ్రీనివాస్ రెడ్డిస్వామి, దసురుస్వామి ఉన్నారు.

వీరన్న సన్నిధిలో పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని రిటైర్డ్ ఎస్పీ చెన్నయ్యతోపాటు కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఒకే గదిలో రెండు 'అంగన్‌వాడీలు'

- ఇబ్బంది పడుతున్న చిన్నారులు, గర్భిణులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఒకే గదిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఐదు సంవత్సరాల నుంచి నడుస్తున్నాయి. ఈదులపూసపల్లి అంగన్‌వాడీ కేంద్రం, మరొక్కటి కొత్తబోడు అంగన్‌వాడీ కేంద్రం. ఒకే గదిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించడం కష్టతరంగా మారిందని టీచర్లు తెలుపుతున్నారు. ఈదులపూసపల్లి అంగన్‌వాడీలో 15మంది పిల్లలు, గర్భిణులు 9మంది, బాలింతలు ఐదుగురు, ఒక టీచర్ ఉన్నారు. ఆయా లేక పోవడంతో కొత్తబోడు అంగన్‌వాడీలో 12మంది పిల్లలు, గర్భిణులు ఇద్దరు, బాలింతలు ఇద్దరు, ఒక టీచర్ ఒక ఆయా ఉన్నారు. వంటలు వండేటప్పుడు ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లు సగం సగం సామగ్రితో వంటలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అందాల్సిన పోషకాహారం సరిగా అందడం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. కొత్తబోడులో కనీసం అద్దె భవనంలోనైన అంగన్‌వాడీ సెంటర్‌ను నడిపించాలని కొత్తబోడు మహిళలు, ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.



ఒకే గదికి రెండు అంగన్‌వాడీ కేంద్రాల బోర్డులు



ఒకే గదిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు, టీచర్లు

చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు..



కొత్తబోడు నుంచి ఈదులపూసపల్లి ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలకు సుమారు అరకిలో మీటరు దూరం. కాలనీ చివరిలో ఉన్న గర్భిణులు, బలింతల మహిళలు, చిన్నారులు నడిచి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంను అందుబాటులో తీసుకురావాలి.

- పుట్ట ఉపేందర్, కొత్తబోడు

కార్పొరేట్‌కు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం

- ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్

కేసముద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుడుం అనిల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అభ్యుదయ రైతు సంఘం భవనంలో జరిగిన సంఘం రాష్ట్ర నిర్మాణ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రామికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మార్చేసి, కార్పొరేట్‌కు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు. ముందుగా సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు నర్ర ప్రతాప్ అంబేడ్కర్ సెంటర్‌లో సంఘం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శివాని, జగదీష్, ఎమ్మెస్ రావు, దానయ్య, సదానందం, సంఘం జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కుంభం సుకన్య పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

పీడీఎస్ బియ్యం స్వాధీనం

దంతాలపల్లి: మండలంలో అక్రమంగా తరలిస్తున్న 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పిల్లల రాజు ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో తనిఖీలు నిర్వహించమన్నారు. సూర్యాపేట జిల్లాకు చెందిన కాసం భద్రయ్య, అదే జిల్లా ఆత్మకూరుకు చెందిన డ్రైవర్ బానోత్ రమేశ్ అక్రమంగా తరలిస్తున్న 40క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కేసముద్రం: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండలం పాతతండాజీపీలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ఇస్లావత్ నరసింహ (55) అనే వ్యక్తి ఈనెల 3న కడుపునొప్పి రావడంతో భరించలేక, తన వ్యవసాయబావి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు మానుకోటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య భద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'పొలంబాట'



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ

పెద్దవంగర: రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే పొలంబాట కార్యక్రమం చేపడుతున్నట్లు ఏఈ రమేష్ బాబు తెలిపారు. ఆదివారం మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో విద్యుత్ అధికారులతో కలిసి పొలంబాట కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్ మోటార్లు, స్టార్టర్ల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఒరిగిన స్తంభాలు మారుస్తామని, పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్‌లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం

గంగారం: దేశ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జనవరి 9న డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని అఖిల భారత యునైటెడ్ రైతు సంఘం (ఏఐయూకేఎస్) జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రభాకర్ కోరారు. రైతు సంఘం ఆలిండియా కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మండలంలోని పందెం, కోడిసెలమిట్ట గ్రామాల్లో ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ రైతు పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ గిరిజన ప్రజల మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం పని దినాలు 200 రోజులకు పెంచాలన్నారు. కార్యక్రమంలో కుర్సం రంగయ్య, పులుసం నాగేశ్వర్‌రావు, పూనెం అశోక్, కుర్సం సురేష్, పాపయ్య, కృష్ణ, శ్రీను, వంసత రావు, సతీష్, అనిల్, చందు, శ్రీకాంత్, అశోక్, హేమలత, రమ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పెంచిన ధరలను అమలు చేయాలి



గోదాం ఎదుట ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

గార్ల: సివిల్ సప్లై కార్మికులకు ప్రభుత్వం పెంచిన ధరలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గార్ల సివిల్ సప్లై గోదాం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. సివిల్ సప్లై హమాలీల సంఘం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు 5రోజులుగా హమాలీ కార్మికులు ధర్నా చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. పౌర సరఫరా శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం, నిత్యావసర సరుకులను లారీల నుంచి ఎగుమతి, దిగుమతులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న హమాలీ కార్మికులకు ప్రభుత్వం పెంచిన ధరలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ధర్నా ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి వీరస్వామి, ఇస్తారి, సర్వయ్య, ముత్తయ్య, సునీల్, అంజయ్య, లక్ష్మి, ఏసు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గం సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో వివిధ వర్గాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయుసీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రామయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లకంటి సూర్యం, నాయకులు జక్కుల యాకయ్య, కమ్మగాని సంపత్, నేరెల్ల బలరాం, అర్వపల్లి వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామయ్య

బెల్ట్‌షాపులు మూయించాలి

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల్లో ఇష్టానుసారంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను మూయించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు మోకాళ్ల మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండలంలోని రామచంద్రాపురంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో బెల్ట్‌షాపులు నిర్వహించటం ద్వారా అనేక మంది మద్యానికి అలవాటుపడి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహా, నాగేశ్వరరావు, నారాయణ, రాము, నెహ్రూ, ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని పాత బజార్‌లోని వెంకట్రామా థియేటర్ వెనుక వీధిలో తక్షశిల హైస్కూల్‌కు వెళ్లే మలుపు ప్రాంతంలో మున్సిపల్ సిబ్బంది పైపులైన్ మరమ్మతుల కోసం పెద్ద గుంత తీశారు. మూడు రోజులు అయినా పనులు పూర్తి చేయకుండా అలాగే వదిలేశారు. రోడ్డు పక్కనే మలుపు ప్రాంతంలో తీసిన పెద్దగుంతతో దానిలో పిల్లలు పడే ప్రమాదం ఉంది. అంతేకాక ఈ ప్రాంతంలోనే పాఠశాల ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గుంత అంచున విద్యుత్ స్తంభం ఉండగా అది కూడా కొంత పక్కకు ఒరిగింది. అధికారులు తక్షణమే స్పందించి గుంతను పూడ్చి వేయాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న గుంత

క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్: కర్తవ్య బోధనాస్త్రం భగవద్గీత అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మురళీనాయక్ ఆదివారం పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వీఎస్ఎస్‌పీ మహిళల హాస్టల్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ ఆసిఫ్, గంద్రాతి మల్లేష్, గోనె శ్యామ్ రావు, సాయికిరణ్ నేత, భీమల్ల ప్రశాంతి, వెంకన్న పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పీఆర్టీయూ నూతన సంత్సరం క్యాలెండర్‌ను మండల శాఖ అధ్యక్షుడు భూక్య రామోజీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల నాగరాజు, బాలాజీ, హనుమంతు, సుగుణ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కురవి: 1981-82 బ్యాచ్ విద్యార్థులు

కురవి: మండలంలోని బలపాల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1981–1982 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వైభవంగా జరిగింది.

బయ్యారం: మండలకేంద్రంలోని గిరిజన వసతిగృహంలో ఉండి 1999–2008 సంవత్సరాల కాలంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే వసతి గృహంలో సమ్మేళనం అయ్యారు. అనంతరం అప్పటి వసతిగృహ అధికారులు సీతారాములు, కోటయ్య, సురేష్, సిబ్బంది లింగన్న, లక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, రవిందర్‌నాయక్, రవిరాజ్, సీతారామ్, రాంబాబు, రవినాయక్ పాల్గొన్నారు.



బయ్యారంలో..

సంక్షిప్త సమాచారం

రైలునుంచి జారిపడి ఒకరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: రైలు నుంచి జారిపడి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మహబూబాబాద్, గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ల మధ్యలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ వైపు నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న ఓ గుర్తు తెలియని రైలు నుంచి బిహార్ రాష్ట్రానికి చెందిన ఘట్కరాం అనే వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. మాజీ సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రాజమౌళికి సమాచారం ఇచ్చాడు. 108కి కాల్ చేసి చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి పంపించారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్: డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని జైపూర్ జిల్లా బాలాగూట్ ప్రాంతానికి చెందిన భరత్‌సింగ్ తన భార్య మెరావితో కలిసి డోర్నకల్ ప్రాంతంలో మిరపతోటలలో కాయకోత పనులకు డోర్నకల్‌కు సింగరేణి రైలులో వస్తున్నాడు. రైలు స్టేషన్‌లోని మూడో ప్లాట్‌ఫారంపై నిలిచే క్రమంలో భరత్‌సింగ్ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పట్టాలపై పడడంతో కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆర్‌పీఎస్ సిబ్బంది 108 వాహనంలో క్షతగాత్రుడిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ధాన్యం లారీకి తాకిన విద్యుత్‌లైన్ తీగలు

గార్ల: ధాన్యం లారీ ఓవర్‌లోడ్‌తో వెళ్తుండగా లారీ డ్రైవర్ మద్యం మత్తులో పైన విద్యుత్ తీగలను గమనించకుండా ధాన్యం లారీని విద్యుత్ తీగలకు తగిలించడంతో సమీపంలోని ఇళ్లలో పలువురి గృహోపకరణాలు కాలిపోయిన సంఘటన ఆదివారం గార్లలోని జెండాబజారులో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలు.. ధాన్యం లారీని రైస్‌మిల్లుకు తీసుకెళ్తుండగా డ్రైవర్ అజాగ్రత్త కారణంగా లారీ ధాన్యం బస్తాలు విత్యుత్ లైన్‌కు తాకడంతో న్యూట్రల్ వైరు తెగి ఫేస్ వైరుపై పడటంతో, జెండా బజారులోని పలు ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. వెంటనే విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లారీని అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌పై ఫిర్యాదు చేసినట్లు విద్యుత్ ఏఈ మహేంద్రబాబు తెలిపారు.

మరిపెడలో చోరీ

మరిపెడ: మరిపెడ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గల హరి సూపర్ మార్కెట్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు చొరబడి సుమారు రూ.30వేలు ఎత్తుకెళ్లారని బాధితుడు హరి తెలిపాడు. సూపర్ మార్కెట్ షెటర్‌ను రాడ్‌తో తొలగించి లోనికి సుమారు ఆరుగురు దొంగలు ప్రవేశించినట్లు సీసీ పుటేజీలో కనిపించినట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు పోలీసులు క్లూస్‌టీం తో సంఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

ఉత్తమ మానవ వనరులుగా మార్చాలి..



తొర్రూరు: విద్యార్థులను ఉత్తమ వనరులుగా తీర్చిదిద్దాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు పట్టణంలో లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, ఎన్నారై, ప్రముఖ వైద్యుడు రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భర్త రాజారామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7న మండలంలో ధర్నా

మరిపెడ: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న మరిపెడ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అలువాల వీరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మరిపెడలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్, బానాల రాజయ్య, జిన్నా లచ్చయ్య, కొండ ఉప్పలయ్య, వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు కేటాయించాలి

కురవి: అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఎం నాయకుడు గంధసిరి శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. ఆదివారం మండల కేంద్రంతోపాటు తులిస్యా, లింగ్యా తండాల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, జ్యోతిబసు, వీరేందర్, మురళీ, బాలు పాల్గొన్నారు.

అన్నదానం

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయ సమీపంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డాక్టర్ దడిగల శరత్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు వీరభద్రంగౌడ్, సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, అభినవ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పును కుదించాలి

కేసముద్రం: కేసముద్రంస్టేషన్ నుంచి కేసముద్రం విలేజ్ వరకు రోడ్డు వెడల్పును కుదించాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల కారణంగా రోడ్డు పక్కనున్న ఇళ్లు, దుకాణాలు కోల్పోతామన్నారు. జిల్లా కేంద్రంలోనే కొన్ని చోట్ల 50 ఫీట్ల రోడ్డు ఉందని, అదే మాదిరిగా ఇక్కడ కూడా 50ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేణు, జావిద్, యాకుబ్‌పాషా, గుండు సాయిలు, మురళీ, కొత్తకొండ యాదగిరి, జానీమియా పాల్గొన్నారు.

'మస్త్ మజా' సందడి



కేసముద్రం: మండల కేంద్రంలోని హరిహర గార్డెన్స్‌లో దూరదర్శన్ (డీడీ యాదగిరి) ఆధ్వర్యంలో మస్త్ మజా అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈమేరకు శ్రీలక్ష్మీ గణపతి కిట్టి క్వీన్స్ ఆధ్వర్యంలో సందడి చోటుచేసుకుంది. కార్యక్రమంలో కిట్టి క్వీన్స్ ప్రతినిధులు శ్రీరాం సుమలత, కోమలత, దూరదర్శన్ నిర్వాహకులు గీత, శ్రీనివాస్, శైలేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శ్మశానవాటిక ప్రారంభం



నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లిలో తన తండ్రి చిర్ర యాదగిరి గౌడ్ జ్ఞాపకార్థం నిర్మించిన శ్మశాన వాటికను గ్రామానికి అంకితం చేస్తున్నట్లు దాతలు మాజీ ఉప సర్పంచ్ చిర్ర యాకాంతం గౌడ్, చిర్ర వెంకట్ గౌడ్ అన్నారు. గ్రామంలో సొంత డబ్బులు రూ.1.50లక్షలతో నిర్మించిన శ్మశాన వాటికను ఆదివారం గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న ఒక్క శ్మశాన వాటికతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు కొంతమంది ద్వారా తమ దృష్టికి వచ్చిందన్నారు. తమ సొంత ఖర్చులతో శ్మశాన వాటికను నిర్మించి గ్రామానికి అంకితం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.